క్లుప్తంగా

హరిబాబుకు సత్కారం



హరిబాబును సత్కరిస్తున్న గ్రామపెద్దలు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ చీపురుగూడెం అధ్యక్షుడిగా చెల్లు హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు గ్రామ సర్పంచ్ గాలింక మల్లిక తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కొండబోయిన ఏడుకొండలు, కార్యదర్శిగా తలశెట్టి నరేష్, సభ్యులుగా కొరపాటి హరిప్రసాద్, నీతిపూడి వెంకటేశ్వరావు, గుర్రాల వెంకటేశ్వరావు ఎంపికయ్యారు. హరిబాబును గ్రామపెద్దలు తలశెట్టి మాధవరావు, గాలింకి రాంబాబు శాలువాతో సత్కరించారు.

వికలాంగులకు బియ్యం, నగదు పంపిణీ



వికలాంగులకు బియ్యం, నగదు అందజేస్తున్న చిన భాస్కరరావు

నల్లజర్ల: ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పుట్టిన రోజు సందర్భంగా పుల్లలపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లూరి చిన భాస్కర రావు అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో పది మంది దివ్యాంగులకు ఒక్కో బియ్యం ప్యాకెట్, రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గాలింకి బాపూజీ, కొక్కిరపాటి వెంకట్రావు, శామ్యూల్, చీమయ్య, సుధీర్, శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా సూర్యప్రకాశరావు

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా దేవరపల్లికి చెందిన బండి సూర్యప్రకాశరావు ఎన్నికయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నబీపేటలో డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలిస్తున్న ఉపాధిహామీ పీడీ జగదాంబ

నల్లజర్ల: మండలంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, ఉద్యాన సాగును పీడీ టి.జగదాంబ సోమవారం సాయంత్రం పరిశీలించారు. తొలుత నబీపేటలో రైతు యద్దనపూడి లక్ష్మణ్ సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగును పీడీ పరిశీలించారు. రైతు లక్ష్మణ నుంచి ఆమె సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోతవరంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆమె వెంట ఏపీడీ అప్పలరాజు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

నిడదవోలు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని ఎస్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో చర్చిపేట, రాయిపేట, సంత మార్కెట్, బస్టాండ్ సెంటర్ ఏరియాలలో సోమవారం జగనన్న సురక్ష సర్వే ముమ్మరంగా చేపట్టారు. జగనన్న సురక్ష సర్వేను మున్సిపల్ కమిషనర్ కె.వి పద్మావతి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హేనాలతో కలిసి ఆయన పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వచ్చే నెల 11న



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ పద్మావతి

స్థానిక వైద్యులతో పాటు ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎలగాడ బాలరాజు, కౌన్సిలర్లు గుర్రం శాంతిశ్రీ, చిలకల శారదాదేవి, ఉసురిమర్తి జాన్‌బాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

నిడదవోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య రక్షణ కార్యక్రమం అని సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.అమరేంద్ర అన్నారు. మండలంలోని రావిమెట్ల, సింగవరం, తాళ్లపాలెం గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. అమరేంద్ర మాట్లాడుతూ ఈ సర్వేలో భాగంగా సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి పలు రకాలు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎ.రాజ మోహన్, మురళీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మండలంలో అంబేడ్కర్ సామాజిక భవనం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రతి మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనం ఏర్పాటు చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. షెడ్యూల్ కులాల సంక్షేమంపై సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎస్సీలకు సుమారు వెయ్యి ఎకరాలను పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో దళితుల సంక్షేమానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి నాలుగేళ్లలో రూ.65 వేల కోట్ల ఖర్చు చేయగా, టీడీపీ పాలనలో కేవలం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసినట్టు ఆయన తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధును టీడీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసి, దళితవాడల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున రూ.500 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు. పేదల విద్యకు ఫీజ్ రీయంబర్స్‌మెంటు అమలు చేసి, విదేశీ విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు ఆయన తెలిపారు. దళితుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పురపాలక సంఘం సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘం సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్టు తెలిపారు. కావున సభ్యులంతా విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బైండోవర్ నిందితుడికి జరిమానా

దేవరపల్లి: బైండోవర్‌లో ఉన్న నిందితుడు గుబ్బల శ్రీనుకు మండల మెజిస్ట్రేట్ మాదాసు రామకృష్ణ సోమవారం రూ.20 వేలు జరిమానా విధించినట్టు ఎస్ఈబీ సీఐ డి.సుధ తెలిపారు. నిందితుడు శ్రీను తహసీల్దార్ వద్ద బైండోవర్ అయినప్పటికీ మళ్లీ నేరం చేయడంతో తహసీల్దార్ ఎం.రామకృష్ణ వద్ద హాజరుపర్చగా రూ.20 వేలు జరిమానా విధించినట్టు ఆమె తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారానికి 'స్పందన'

నిడదవోలు రూరల్: స్పందన కార్యక్రమం, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.గంగరాజు ఆదేశించారు. నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో భాగంగా 13 అర్జీలను ఆయన సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూలు, ఏఓ జి.సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ప్రజలకు మేలు

పెరవలి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆయుష్ పెరుగుతుందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ శాఖ స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులతో పండించే ఉత్పత్తుల వల్ల అనేక రోగాలు వస్తున్నాయని, ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. తహసీల్దార్ టి. రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నదని, ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ఎగ్జక్యూటివ్ రామకృష్ణ తదితరులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వివిధ శాఖల అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్

ఎంపీపీకి అభినందనలు

ఉండ్రాజవరం: రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరికి పలువురు అభినందనలు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రెండేళ్లలో మండలంలో రూ.1.70 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావుతో కలసి ఆమె కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరహరశెట్టి సరోజ, చెట్టే నవీన్, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకటేశ్వరరావు, గాడి కృష్ణఫర్, ధనిశెట్టి మహేష్, పాలాటి శరత్‌బాబు, దోనేపూడి సుధాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య

స్పందనలో 11 అర్జీల స్వీకరణ

కొవ్వూరు: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యాలయంలో 11 అర్జీలు అందాయని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జవహర్ బాజీ తెలిపారు. తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన తానేటి విజయకృష్ణ అనే వ్యక్తి తన పోలానికి నీరు ఇవ్వకుండా పంటకి నష్టం కలుగు చేస్తున్నారని, ఇరవై మంది ముఠాగా ఏర్పడ్డారని, వారితో తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. భూ సర్వే, పాస్ పుస్తకం ఇప్పించాలని, భూమి రికార్డుల్లో తప్పుగా నమోదు అయిందని తదితర సమస్యలపై పలు అర్జీలు అందించారని ఆర్డీఓ తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పరిమి రాధాకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ,చెరుకూరి సాయిరాజు పాల్గొన్నారు.

నికర లాభంలో సభ్యులకు 10 శాతం డివిడెంట్ చెల్లింపు

ఉండ్రాజవరం: నికరలాభంలో సొసైటీలోని సభ్యులకు 10 శాతం డివిడెంట్ చెల్లించినట్లు త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు కోతారు సత్యనారాయణ తెలిపారు. చివటం సొసైటీ కార్యాలయంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి గాను సొసైటీలో రూ.10.17 కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో తిసభ్య కమిటీ సభ్యులు బోర్రా సూర్యనారాయణ, ఇల్లింద్రపర్తి మీరయ్య, సీఈవో వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిది మంది అరెస్టు

ఉండ్రాజవరం: చివటం గ్రామంలో ఓ పెంకుటింట్లో పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.65 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకోన్నామని ఎస్సై కె.రామారావు తెలిపారు.

పాఠశాలలో విచారణ

చాగల్లు: చాగల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీవైఈవో ఎస్.రవింద్ర భారతి సోమవారం సందర్శించారు. ఇటీవల పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయుని విద్యార్థిని కులం పేరుతో దుషించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో డీవైఈవో విచారణ చేపట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. నివేదిక ఉన్నత అధికారులకు అందజేస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల పని తీరును, మరుగుదోడ్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.వీర్రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముద్రగడ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

153 మందికి కంటి పరీక్షలు

తాళ్లపూడి: శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు సందర్భంగా తాళ్లపూడిలోని ఆర్యవైశ్య సత్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 153 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. 12 మందికి ఆపరేషన్లు, 36 మందికి కళ్ల జోళ్లు అవసరం అని గుర్తించారు.

రైతు శ్రేయస్సే పీఏసీఎస్ లక్ష్యం

కొవ్వూరు: సొసైటీ ద్వారా రైతులకు మేలైన సేవలందించేందుకు కృషి చేస్తామని ఆరికిరేవుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు చావా పేర్రాజు(నానిబాబు) పేర్కొన్నారు. సోమవారం సొసైటీ మహాజన సభ చైర్మన్ నానిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.8,74,879 నికర లాభం లభించిందన్నారు. సంఘ సభ్యులకు డివిడెంటుగా 15 శాతం అందించాలని మహాజన సభలో తీర్మానించారు. సంఘం ద్వారా ఈ ఏడాది రూ.12.16కోట్లు రుణాలందించామన్నారు. మెంబర్స్ ద్వారా రూ.3.20కోట్లు డిపాజిట్లు, షేర్‌ధనం రూ.74.25 లక్షలు ఉందన్నారు. సొసైటీ కార్యదర్శి చావా ప్రసాద్, త్రీమెన్ కమిటీ పర్సన్లు ఈలీ అరవలరాజు, వేటి ధర్మరాజు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాపవరం పీఏసీఎస్‌లో..

కాపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజన సభ సోమవారం సొసైటీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో 917 మంది రైతులుంటే 315 మంది రైతులకు రుణాలు అందించామన్నారు. సంఘంలో సభ్యుల నుంచి రూ.95.13లక్షలు డిపాజిట్లు సేకరించామన్నారు. సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్నీ రకాల రుణాలు కలిపి రూ.4.75 కోట్లు అందించామన్నారు. సొసైటీ కార్యదర్శి చౌటుపల్లి కృష్ణారావు, త్రీమెన్ కమిటీ సభ్యులు వెంపాటి సత్యనారాయణ, కంచుమర్తి బాల శంకరం పంతులు తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ సుంకర సత్యనారాయణ

పామాయిల్, కొబ్బరి రైతులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

నల్లజర్ల: పామాయిల్, కొబ్బరి తోటలపై నుంచి విద్యుత్ లైన్లు ఉన్న చోట్ల దింపు కార్మికులు తగు భద్రతా ప్రమాణాలు పాటించాలని నల్లజర్ల విద్యుత్ సబ్‌డివిజన్ ఏడీఏ డి.రాజబాబు కార్మికులకు సూచించారు. దూబచర్ల గ్రామ సచివాలయం-1 వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కార్మికుల భద్రతకు సంబంధించి ఉద్యాన, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాజబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటలపై విద్యుత్ లైన్లు ఉంటే తమ సిబ్బందితో సంప్రదించి అవసరం అయితే పని పూర్తయ్యేవరకూ సరఫరా నిలుపుదల చేయించుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా ద్వారా ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గెలలు కోసే కత్తులకు మొదలులో అల్యూమినియం పైపులు కాకుండా ఇన్సూలేషన్ పైపులు వాడినట్టయితే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునన్నారు. గెలలు దింపు సమయంలో ఒకరిద్దరు కాకుండా కనీసం ముగ్గురు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి బబిత, అనంతపల్లి ఏఈ పి.బాపిరాజు, నల్లజర్ల జేఈ నారాయణ, గ్రామకార్యదర్శి రత్నం తదితరులు పాల్గొన్నారు.



దూబచర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రాజబాబు

చాగల్లు: మండలంలో చిక్కాలపాలెం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఏడీ పి.అచ్యుతాచారి ఆధ్వర్యంలో సోమవారం కలవలపల్లి, ఉనగట్ల గ్రామాల కొబ్బరి, పామాయిల్ రైతులకు విద్యుత్ ప్రమాదాలు, అప్రమత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

గోపాలపురం: జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గోపాలపురం ఎలక్ట్రికల్ ఏడీఈ పి.రవిశంకర్ సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ అధికారి పి రామకృష్ణ, జగన్నాథపురం, కరిచర్లగూడెం, కోమటికుంట రైతులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకంపై అధికారుల విచారణ

తాళ్లపూడి: వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, అధ్యక్ష పదవి కోర్టులో స్టే ఉందని అందువల్ల కోర్టు నిర్ణయం పై ఆధారపడి ఉందని ఏపీఎస్ఐడీసీ ఈఈ అనురాధ అన్నారు. వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం నిర్వహణ, అధ్యక్షుడి తీరుపై ఆయకట్టు రైతులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో సోమవారం విచారణ చేపట్టినట్టు ఏపీఎస్ఐడీసీ అధికారులు తెలిపారు. ఏపీఎస్ఐడీసీ ఈఈ అనురాధ, ఇతర అధికారులు సచివాలయం వద్ద సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, రైతులతో మాట్లాడారు. అనంతరం కాలువలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ గురవయ్య, ఏఈ సురేంద్ర, రైతులున్నారు.